ఉపాధి కూలీల వేతన వెతలు

- కుటుంబ పోషణ కోసం శ్రమజీవుల ఇబ్బందులు
- మండలంలో 12 వారాలుగా కూలీ డబ్బులు రాలేదు
- సుమారు రూ.30 లక్షల బకాయిలు



వై.కోడూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఎర్రగుంట్ల : జమ్మలమడుగు నియోజకవర్గ వ్యాప్తంగా ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల్లో గతంలో ముమ్మరంగా ఉపాధి హామీ పథకంలో పనులు జరుగుతుండేవి. దీంతో రోజూ వేలాది మంది కూలీలు ఉపాధి పనులు కోసం వెళ్లేవారు. ప్రతి వారం కూలీలకు బిల్లులు మంజూరయ్యేవి. ప్రస్తుతం 12 వారాలుగా ఉపాధి బిల్లులు చెల్లించలేదు. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లాది రూపాయాలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ఒక్క ఎర్రగుంట్ల మండలంలోనే సుమారు రూ.30 లక్షలు దాక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సాధారణంగా ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్తే వారానికి ఒకసారి బిల్లులు మంజూరు చేయాలి. ఏదైన సాంకేతిక సమస్య ఏర్పడితే రెండు వారాల్లో బిల్లులు మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ గత 12 వారాలుగా బిల్లులు రాకపోవడంతో ఉపాధి కూలీలకు పూటగడవక నిత్యావసర సరుకుల కోసం కిరణాషాపుల్లో అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకుంది. క్షేత్రస్థాయి సిబ్బందిని బిల్లుల గురించి అడిగితే తమ చేతుల్లో ఏమీ లేదని సమాధానం చెబుతున్నారని కూలీలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఉపాధి కూలీల వేతనాలు సకాలంలో చెల్లించాలని వారు కోరుతున్నారు.

వారంలోపు బిల్లులు..

సాధారణంగా ఉపాధి కూలీలు పనులకు వేళ్లే వారం చివరిలో టెక్నికల్ అసిస్టెంట్ కొలతలు తీసి మరుసటి రోజు కంప్యూటర్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. అలా చేసిన వారం లోపు వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా వేతన మొత్తం జమవుతుంది. బిజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెండు లేక మూడు నెలలకు ఒక్కసారి జమ చేయడం పరిపాటిగా మారింది. గతంలో కూలీల వేతనాలు చెల్లించిన, మెటీరియల్ బిల్లులు ఆలస్యంగా వచ్చేవి. ప్రస్తుతం మెటీరీయల్ బిల్లులు వచ్చినా వేతన బిల్లులు ఆలస్యంగా వస్తున్నాయి. చాలా కుటుంబాల్లో ఇద్దరు నుంచి ముగ్గురు ఉపాధి కూలీలు పనులకు వెళ్తున్నారు. బిల్లులు ఆలస్యం కావడంతో కుటుంబం గడవని పరిస్థితి నెలకొందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

12 వారాలుగా బిల్లులు రాలేదు



మండలంలో ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలకు 12 వారాలు బిల్లులు రాలేదు. ఉన్నతాధికారుల సూచన మేరకు ఈనెల మొదటి వారంలో బిల్లులు చెల్లించే అవకాశం ఉంది. మండలంలో రోజుకు 150 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఇలా మూడు నెలలుగా రూ.30 లక్షలు పెండింగ్ బకాయిలు ఉన్నాయి. ఈ ఏడాది కూడా పనిదినాలు లక్ష్యాలు సాధించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించాం.

– గంగాభవానీ, ఏపీఓ, ఉపాధి హామీ పథకం, ఎర్రగుంట్ల

క్లుప్తంగా

పంట నమోదు తప్పనిసరి

పెద్దముడియం : ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పంటకు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి అరుణ తెలిపారు. గురువారం ఆమె మండలంలోని జంగాలపల్లెలో వ్యవసాయ శాఖ సిబ్బంది చేస్తున్న ఇ-క్రాప్ పంట నమోదును ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. కౌలు కార్డులు పొందిన రైతులు కూడా తమ పేరు మీద పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతు పొలానికి రైతు సేవా కేంద్రం అసిస్టెంట్లు వెళ్లి ఇ-క్రాప్ చేస్తారన్నారు. రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

దోమకాటు ఆరోగ్యానికి చేటు

పులివెందుల రూరల్ : దోమకాటు ఆరోగ్యానికి చేటని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య తెలిపారు. గురువారం నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని మోట్నూతలపల్లిలో ఇంటింటా ఫీవర్, లార్వా సర్వే నిర్వహించి నిల్వ ఉన్న నీటి తొట్టిలలో అబేట్ పిచికారీ చేయించారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గూన్యా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. లార్వా నిర్మూళనకు ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జగదీష్, ఎంఎల్‌హెచ్‌పీ శైలాబీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్త పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వేంపల్లె : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయమైన భాస్కర్ కుటుంబానికి వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. గురువారం మండలంలోని తువ్వపల్లెలో నివసించే ఆ కుటుంబానికి రూ.6వేలు నగదును ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి అందించారు. ఎవరైనా నిస్సహాయ స్థితిలో ఉంటే వికసిత ఫౌండేషన్ దృష్టికి తేవాలని తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పత్తి, కంది పంటల పరిశీలన

ఎర్రగుంట్ల : మండలంలోని పెద్దనపాడు గ్రామంలో సాగుచేసిన పత్తి, కంది పంటలను కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి గురువారం పరిశీలించి రైతులకు సూచనలు సలహాలు అందించారు. పంటలు సాగు చేసేటప్పుడు వ్యవసాయ సిబ్బంది సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. పంటలలో అధిక దిగుబడి రావాలంటే తప్పనిసరిగా పురుగు నివారణ మందులను వాడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ వివేకా జయంతి



వైఎస్ వివేకా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న నర్రెడ్డి సునీత, తదితరులు

పులివెందుల రూరల్/లింగాల : దివంగత వైఎస్ వివేకానందరెడ్డి జయంతి వేడుకలను పులివెందులలో గురువారం ఘనంగా నిర్వహించారు. కడప రోడ్డులో ఉన్న వైఎస్ వివేకా విగ్రహానికి ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డిలు పూలమాలలు వేసి, అనంతరం డిగ్రీ కళాశాల రోడ్డులో ఉన్న వైఎస్సార్ బరియల్ గ్రౌండ్‌లో వైఎస్ వివేకా సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శివప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల మండలం బోనాల గ్రామంలో దివంగత వైఎస్ వివేకానందరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి, బాబురెడ్డిలు ఎస్సీ కాలనీలో వివేకానందరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఉచిత వాటర్‌ప్లాంట్‌ను నిర్మింపజేశారు. వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి శివప్రకాష్‌రెడ్డిలు ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు జగదీశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

లింగాల : మండలంలోని పార్నపల్లె 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో కె.చెర్లోపల్లి ఫీడర్ కింద విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ బాలసంజీవులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఉంటుందన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తొండూరు : మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 2024-25 సంవత్సరానికి మూడవ విడత దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్, ఆధార్, కులధృవీకరణ పత్రాలను తీసుకుని ప్రభుత్వ ఐటీఐ నందు ఈనెల 29న కౌన్సిలింగ్‌కు హాజరుకావాలన్నారు.

వృద్ధులకు అన్నదానం

లింగాల : మండలంలోని కసనూరు గ్రామానికి చెందిన కటికరెడ్డి రామచంద్రారెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి చారిటబుల్ ట్రస్ట్‌లోని వృద్ధాశ్రమంలో ఆయన కుమారుడు రామాంజులరెడ్డి వృద్ధులకు అన్నదానం చేశారు.

వల్లూరు ఎస్ఐగా సంజీవరాయుడు

వల్లూరు : వల్లూరు ఎస్‌గా కడప టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న సంజీవ రాయుడును నియమించారు. వల్లూరు ఎస్ఐ కత్తి వెంకటరమణను రాజుపాలెం ఎస్ఐగా బదిలీ చేశారు.

కలమల్ల ఎస్ఐగా తిమోతి



ఎర్రగుంట్ల : మండలంలోని కలమల్ల పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐగా తిమోతిని నియమించారు. జమ్మలమడుగు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటిలిజెన్స్ ఎస్ఐగా తిమోతి విధులు నిర్వహిస్తు వీఆర్‌కు వెళ్లారు.

ఎర్రగుంట్ల ఎస్ఐలుగా నాగమురళి, విష్ణునారాయణ

ఎర్రగుంట్ల : స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు నాగమురళి, విష్ణునారాయణలు నూతన ఎస్ఐలుగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డిని ఆర్‌కే వ్యాలీకి, చిరంజీవిని సిద్ధవటంలకు బదిలీ అయ్యారు. కలసపాడులో పనిచేస్తున్న ఎస్ఐ నాగమురళి, పులివెందలలో పనిచేస్తున్న ఎస్ఐ విష్ణునారాయణలను ఎర్రగుంట్ల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లకు బదిలీ అయ్యారు. త్వరలో వీరిద్దరు పదివీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

10వ తేదీలోపు బకాయిలు చెల్లించండి

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలోని గ్రామాలు, మండలాల్లో ఉన్న విద్యుత్ మొండి బకాయిలను ఈనెల 10వ తేదీలోపు చెల్లించాలని విద్యుత్‌శాఖ డీఈ శ్రీకాంత్ తెలిపారు. 10వ తేదీ లోపు చెల్లించకపోతే విద్యుత్ సర్వీసు మీద అపరాధ రుసుము చెల్లించాల్సి వస్తుందన్నారు. బకాయిలను విద్యుత్ చార్జీల కేంద్రం వద్ద కానీ, గ్రామాలకు వచ్చే విద్యుత్ సిబ్బంది ద్వారా చెల్లించాలని ఆయన తెలిపారు.

ఉచితంగా నీటి సరఫరా

జమ్మలమడుగు : పట్టణంలో శుక్రవారం, శనివారాలలో తాగునీటి సరఫరా బంద్ అవుతుందని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో 20 వార్డులకు తాగునీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

పులివెందుల టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికల సందడి నెలకొంది. ఎస్ఎంసీ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిపేందుకు పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులనే కమిటీ సభ్యులుగా, చైర్మన్, వైఎస్ చైర్మన్‌లుగా ఎన్నుకుంటారు. పాఠశాల అభివృద్ధి కోసంతో పాటు బలోపేతం చేసేందుకు కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుంది. అందులో భాగంగా గురువారం పులివెందుల పరిధిలోని 49 ప్రభుత్వ పాఠశాలలకు గానూ 48 పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో ఫోరం లేనందున శుక్రవారానికి వాయిదా వేయడం జరిగింది. ఎంఈఓలు చంద్రశేఖర్‌రావు, రామానాయుడులు ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలో ఉన్న 51 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను హెచ్ఎంలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి జాఫర్‌సాదిక్ తెలిపారు. ఈ మేరకు 50 పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో ఎలాంటి ఘర్షణలు జరుగకుండా సీఐ సురేష్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

సింహాద్రిపురం..

సింహాద్రిపురం : మండలంలోని 38 పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలను నిర్వహించారు. 10 పాఠశాలల్లో ఏకగ్రీవంగా, 28 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. అలాగే గురిజాల, రావులకొలను, పైడిపాలెం సమస్యాత్మకంగా ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పులివెందుల రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐ అనిల్‌కుమార్‌లు పర్యవేక్షించారు. మండల విద్యాశాఖ అధికారి శారద, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి ఎన్నికలు సజావుగా జరగడంతో అనందం వ్యక్తం చేశారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలోని 67 పాఠశాలల్లో గురువారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ఏకగ్రీవంగా పూర్తి అయ్యాయి. ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం అన్ని తరగతుల ద్వారా ఎంపికైన సభ్యులకు ఎన్నిక నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. 10 హైస్కూల్స్, 3 యూపీ స్కూల్స్, 54 ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఎస్ఎంసీ ఎన్నికలను నిర్వహించగా ప్రతి పాఠశాలలో చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఎంసీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే ఎంఈఓ 1 బేబి, ఎంఈఓ-2 సుభాషిణిలు ఎన్నికలను పర్యవేక్షించారు.



కమలాపురం బాయ్స్ హైస్కూల్‌లో ఎంపికైన నూతన కమిటీతో ఉపాధ్యాయ బృందం

వలూరులో..

వల్లూరు : మండల వ్యాప్తంగా వున్న 46 పాఠశాలల్లో కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయగా అందులో 46 పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని 3 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక ఏపీ మోడల్ స్కూల్, ఒక కస్తూర్బా గాంధీ బాళిక విద్యాలయంతో పాటు 2 మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, ఒక ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాల, 39 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించారు. సమగ్ర శిక్షా జిల్లా సెక్టోరియల్ అధికారి విశ్వనాథరెడ్డి, ఎంపీడీవో విజయభాస్కర్, ఎంఈవోలు లిల్లెమ్మ, విజయరెడ్డిలు ఎన్నికలను పర్యవేక్షించారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని 67 పాఠశాలల్లో పోటీ లేకుండా అన్ని పాఠశాలల్లో ఏకగ్రీవంగా చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులను తల్లిదండ్రులు ఎన్నుకున్నారన్నారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : స్థానిక జెడ్పీ హైస్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా సందానిబాషా, వైస్ చైర్మన్‌గా లక్ష్మీదేవిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే జడ్పీహెచ్ స్కూల్ (బాలికలు) మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ సాదు కస్తూరి, వైస్ చైర్మన్‌గా కిషోర్ కుమార్ ఎన్నికయ్యారు. మండలంలోని 43 స్కూళ్లలో చైర్మన్లను, వైస్ చైర్మన్ ఏకపక్షంగా ఎన్నుకున్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : మండలంలోని 58 పాఠశాలల్లో పాఠశాల కమిటీ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ-2 చంద్రశేఖర్‌రావు తెలిపారు. 40 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 13 ఉన్నతపాఠశాలల్లో జరిగినట్లు తెలిపారు. పట్టణంలోని పతంగే రామన్నరావు ఉన్నత పాఠశాల చైర్మన్‌గా మేడిగ కవిత ఎన్నికైనట్లు తెలిపారు. అలాగే మైలవరం మండలంలో మొత్తం 53 పాఠశాలలు ఉండగా అందులో 46 పాఠశాలల్లో చైర్మన్‌లను ఏకగ్రీవంగా చేశారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు, కమిటీ సభ్యులకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఏక పక్ష నిర్ణయంతో ఎన్నికలు ఉపాధ్యాయులు నిర్వహించారని కమిటీ సభ్యులు వాదించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికలలో పోటీ చేయకూడదని ఉపాధ్యాయులు చెప్పారని అందుకే మేం పోటీ చేయలేదని, అయితే పదవ తరగతి చదువుతున్న విద్యార్థి తండ్రిని ఏ విధంగా పోటీ చేయించారని తల్లిదండ్రులు కమిటీ సభ్యులు వాదించారు. దీంతో కొంత సేపు వాగ్వివాదాలు జరిగాయి. ఎస్ఎంసీ చైర్మన్ ఎస్ ముస్కిన్‌వలి, వైస్ చైర్మన్ డీ హసీనాలను కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. ఈట్టణ సీఐ నరేష్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మండలంలోని 50 ప్రభుత్వ పాఠశాలలకు గాను 46 పాఠశాలలో ఏకగ్రీవంగా, 4 పాఠశాలలో ఓటింగ్ పద్ధతిలో ఎన్నికలు జరిగినట్లు మండల విద్యాధికారిశివప్రసాద్ తెలిపారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గురువారం అధికారులు మండలంలోని 35 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌గా జి.రహంతుల్లా ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. తహసీల్దారు రామకుమారి, సీఐ దస్తగిరి, మండల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : మండలంలోని అన్ని పాఠశాలల్లో పాఠశాల మేనేజ్‌మెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ చౌడయ్య తెలిపారు. ఉన్నత పాఠశాలలు-6, ప్రాథమికోన్నత-3, ప్రాథమిక పాఠశాలలు-28కి చైర్మన్, వైఎస్ చైర్మన్‌లను విద్యార్థుల తల్లితండ్రులు ఎన్నుకున్నారు. పెద్దముడియం ఉన్నత పాఠశాలకు దస్తగిరి, జంగాలపల్లె ఉన్నత పాఠశాలకు ఫకృద్దీన్, భీమగుండం ఉన్నత పాఠశాలకు కె.సంధ్య, గుండ్లకుంట ఉన్నత పాఠశాలకు ఎన్.రమాదేవి, పెద్దపసుపుల ఉన్నత పాఠశాలకు పి.జగదీశ్వరరెడ్డి, ఎన్.కొట్టాలపల్లె ఉన్నత పాఠశాలకు బి.ఖాదర్‌బీ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని 49 ప్రభుత్వ పాఠశాల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈఓ ఒబులేసు తెలిపారు. మండలంలో 52 ప్రభుత్వ పాఠశాలలకు ఎస్ఎంసీ ఎన్నికలు ఉండగా టి.కోడూరు జెడ్పీ ఉన్నతపాఠశాల, పొట్టిపాడు జెడ్పీ ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదాపడినట్లు ఆయన తెలిపారు. చైర్మన్, వైఎస్ చైర్మన్, కో ఆప్టేడ్ మెంబర్స్ ఎన్నుకున్నామన్నారు. ఎంఈఓ 2 రామయ్య, సీఐ మహమ్మద్ రఫీ. ఎస్ఐ యోగీంద్ర పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

వల్లూరు : మండలంలోని గురువారం నాగులచవితి పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఆలయాల వద్ద వున్న నాగులకు పోగులు చుట్టి, పత్తి వత్తులను, నాగుల చీరలను వుంచి, పూజలను నిర్వహించారు. ప్రసాదాలు పంచి పెట్టారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : మండలంలో భక్తులు గురువారం నాగులచవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పుట్ట వద్ద మొక్కుబడులను చెల్లించుకున్నారు. పట్టణంలోని నాగులకట్టకు భక్తులు తరలి వచ్చి పూజలు నిర్వహించారు.



జమ్మలమడుగు నాగులకట్టవీధిలో పుట్టవద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సింహాద్రిపురంలో

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా నాగల చవితిని పురస్కరించుకుని మహిళలు నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలో నాగులచవితి పర్వదిన వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు నాగుల ప్రతిమలకు, పుట్టలకు పూజలు చేశారు. పాలు, నువ్వుల పిండిలను నైవేద్యంగా సమర్పించారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : పట్టణంలోని మిట్టమల్లేశ్వర స్వామి ఆలయం, బ్రాహ్మణపల్లె రోడ్డులోని నాగుల కట్ట, తూర్పు ఆంజనేయస్వామి, పీడబ్ల్యూకాలనీ ఆంజనేయ స్వామి ఆలయం, పార్నపల్లెరోడ్డు సాయిబాబా ఆలయం, రాణితోపు సమీపంలో ఉన్న నాగుల పుట్టల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతుకు పారితోషికం



రైతుకు పారితోషికం అందజేస్తున్న రామాంజులరెడ్డి

లింగాల : పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించిన రైతుకు కెఆర్‌సీఆర్ రైతు దీవెన పేరుతో అవార్డుతోపాటు రూ.5వేలు పారితోషికం అందజేస్తారు. దీనిలో భాగంగా లింగాల మండలంలోని చిన్నకుడాల గ్రామానికి చెందిన రైతు కృష్ణమూర్తికి అవార్డుతో పాటు రూ.5వేలు పారితోషికాన్ని అందజేశారు. రైతు దీవెన అవార్డును ప్రతీ ఏడాది రైతుకు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా రామాంజులరెడ్డి మాట్లాడుతూ మా తండ్రి రైతు బిడ్డ అయినందువల్ల రైతులను, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు.

కన్నుల పండువగా అమ్మవారి గ్రామోత్సవం

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురంలో అంకాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని వెల్లాల సీతారామశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రెండవ రోజు గురువారం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం చెక్కభజన లు, మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ని ర్వహించారు. శుక్రవారం మూడవ రోజు ఉదయం 10 గంటల నుంచి ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నారు.



గ్రామోత్సవంలో చెక్కభజన నిర్వహిస్తున్న భక్తులు

డ్రిప్పుల కోసం దరఖాస్తు చేసుకోండి

సింహాద్రిపురం : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బిందు, తుంపర సేద్యం కొరకు డ్రిప్పు పరికరాలను మండల వ్యాప్తంగా 3,450 హెక్టార్లకు కేటాయించామని హెచ్ఈఓ వీరారెడ్డి తెలిపారు. మండలంలో అర్హత ఉన్న రైతులందరు రైతు సేవా కేంద్రాల్లో రిజిష్టర్ చేసుకోవాలని ఆయన తెలిపారు. గతంలో సబ్సిడీలో తీసుకున్న రైతులకు 7 సంవత్సరాలు పూరైన తర్వాత అర్హత వస్తుందన్నారు.

11న సర్వసభ్య సమావేశం

జమ్మలమడుగు రూరల్ : 11వ తేదీ విజయవాడ గాంధీనగర్‌లోని హోటల్ శ్రీరామ్ (స్వర్ణ ప్యాలెస్ ఎదురుగా) ఉదయం 11 గంటలకు రిటైర్డ్ వీఆర్‌ఓ, వీఏఓ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా రిటైర్డ్ వీఆర్‌ఓ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.ఖాదర్‌బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

వేంపల్లె : పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మా అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్, పోలీసుస్టేషన్ ఆవరణలో తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, సీఐ సురేష్‌రెడ్డిలతో కలిసి ఆమె మొక్కలు నాటి నీరు పోశారు. ఆమె మాట్లాడుతూ దేశ ప్రధాని మోడీ పిలుపు మేరకు అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు.